RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 297 | శుక్రవారం 10 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ, | పేజీలు :6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి

**కేటీఆర్‌తో భేటీ అనంతరం జీవన్ రెడ్డి**

**బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తుకు పాటుపడవచ్చని వ్యాఖ్య**

**శేషజీవితంలో కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం వచ్చిందన్న జీవన్ రెడ్డి**

**జీవన్ రెడ్డి నివాసానికి చేరుకుని పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్**

తాను బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని జగిత్యాల మాజీ ఎమ్మెల్యే, ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జీవన్ రెడ్డి ప్రకటించారు. శేషజీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తు కోసం కూడా పాటుపడవచ్చని పేర్కొన్నారు.అంతకుముందు, జగిత్యాలలో జీవన్ రెడ్డిని బీర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. హైదరాబాద్ నుంచి జగిత్యాలకు చేరుకున్న కేటీఆర్... జీవన్ రెడ్డితో ఆయన నివాసంలో గంటకు పైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేటీఆర్ వెంట ఎల్. రమణ, పాడి కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులు ఉన్నారు.



ఏపీ, తెలంగాణ ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా

## సురేశ్ బత్తిని నియామకం

**ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు**

**గతంలో హైదరాబాద్ రీజియన్‌లో చీఫ్ కమిషనర్‌గా పని చేసిన సురేశ్**

**ప్రస్తుతం ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఉన్న మోరంపూడి అనిల్ కుమార్**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని నియమితులయ్యారు. ప్రస్తుతం మోరంపూడి అనిల్ కుమార్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఉన్నారు. ఆయన స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు చేపడుతారు. వీరిద్దరూ తెలుగువారే. సురేశ్ బత్తినిని నియమిస్తూ కేంద్రప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఉత్తర్వులు జారీ చేసింది.సురేశ్ బత్తిని గతంలో హైదరాబాద్ రీజియన్‌లో చీఫ్ కమిషనర్‌గా పని చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని పన్నుల పరిపాలన, ఆదాయ వసూళ్ల లక్ష్యాలు, శాఖాపరమైన అంశాలపై ఆయనకు పూర్తిస్థాయి అవగాహన ఉంది. రెండు తెలుగు



రాష్ట్రాల్లో ఆదాయపన్ను శాఖకు సంబంధించి అత్యున్నత పదవి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పదవి. పన్ను వసూళ్ల లక్ష్యాలను పర్యవేక్షించడంతో పాటు చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడం, శాఖాపరమైన పరిపాలనను సమన్వయం చేయడం వంటివి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ప్రధాన బాధ్యతలు.

కేరళ, అసోం, పుదుచ్చేరిలో

## ముగిసిన పోలింగ్...

**-ప్రశాంతంగా ముగిసిన కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్**

**-పుదుచ్చేరిలో రికార్డు స్థాయిలో నమోదైన ఓటింగ్ శాతం**

**-కేరళలో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న మూడు ప్రధాన కూటములు**

**-వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ భారీగా పోలింగ్**

**-మే 4న ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసిన ఎన్నికల సంఘం**



కేరళ, అసోం రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మూడు ప్రాంతాల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ అధికారికంగా ముగిసినప్పటికీ, పలు కేంద్రాల్లో ఓటర్లు క్యూలలో వేచి ఉండటంతో వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపును మే 4వ తేదీన చేపట్టనున్నారు.

2

తమ మంత్రి కంపెనీలో అవినీతి జరిగిందని

## ముఖ్యమంత్రే చెప్పారు: హరీశ్ రావు

**రాఘవ కన్ స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారన్న హరీశ్ రావు**

**ముఖ్యమంత్రి చెప్పింది తప్పని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు చెప్పలేదని ప్రశ్న**

**ఆయన పొంగులేటి కాదని, పొంగు'లూటీ' అని ఎద్దేవా**

తమ మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని తమ అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనుమతులు లేకుండానే నడుపుతున్నారని రాఘవ కన్ స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు.పొంగులేటికి చెందిన ఈ కంపెనీలో అవినీతి జరిగిందని సీఎం చెప్పడం, అధికారులు నోటీసులు ఇవ్వడం తప్పా లేక తన కంపెనీపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు. నాలుగు శాఖలకు చెందిన అధికారులు ఈ కంపెనీకి మూడుసార్లు నోటీసులు ఇచ్చారని తెలిపారు. తన కంపెనీ విషయంలో ముఖ్యమంత్రి తప్పు చెప్పారని సభలోనే పొంగులేటి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఆయన పొంగులేటి కాదని, పొంగు'లూటీ' అని ఎద్దేవా చేశారు.నాదర్‌గుల్



భూముల వ్యవహారం గురించి మాట్లాడుతూ, రెండున్నరేళ్లుగా ఆ భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. అది ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తోందని నిలదీశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్ల పైకి మాత్రమే వెళుతుందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధిస్తుంది: ప్రధాని మోదీ

**ఐదేళ్ల క్రితం నాటి నందిగ్రామ్ ఫలితమే ఇప్పుడు బెంగాల్ అంతటా వస్తుందన్న మోదీ**

**బెంగాల్ అభివృద్ధికి, చరిత్ర తిరగరాయడానికి ఉపయోగపడే ఎన్నికలు అన్న ప్రధాని**

**బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ మోసాలు ప్రజల ముందు ఉంచుతామని వ్యాఖ్యలు**



2

బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, బీజేపీ అద్భుత విజయం సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. హల్దియాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో మమతా బెనర్జీ ఓడిపోయారని గుర్తు చేశారు. ఈసారి రాష్ట్రమంతా అదే ఫలితం వస్తుందని అన్నారు

చేయాల్సింది పాదయాత్ర కాదు...

## ఆత్మవిమర్శన యాత్ర

**-వైఎస్సార్ పాదయాత్రకు నేటితో 23 ఏళ్లు -జగన్‌పై షర్మిల తీవ్ర విమర్శలు**

**-బీజేపీ కేసులకు భయపడి వైఎస్సార్ లౌకికవాదానికి జగన్ తూట్లు పొడిచారని ఆరోపణ**

**-దళితులు, మైనారిటీలపై దాడులు జరుగుతున్నా జగన్ మౌనంగా ఉన్నారని ఫైర్**

**-పాదయాత్ర కాదు, ముందు ఆత్మవిమర్శ యాత్ర చేయాలని జగన్‌కు హితవు**

ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చారిత్రాత్మక పాదయాత్ర చేపట్టి నేటికి 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, జగన్ విధానాలను, వైఎస్సార్ ఆశయాలను పోలుస్తూ షర్మిల సూటి ప్రశ్నలతో విరుచుకుపడ్డారు. తండ్రి పేరును పార్టీలో పెట్టుకుని, ఆయన ఆశయాలకు పూర్తిగా వ్యతిరేకంగా జగన్ పనిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఇవాళ ఏప్రిల్ 9! సరిగ్గా 23 సంవత్సరాల క్రితం మన తండ్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారు, అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో పాదయాత్ర అనే మహాయజ్ఞం మొదలుపెట్టారు. పేదల బాగు కోసం,



2

బడుగుల మంచి కోసం, సకల జనుల సంక్షేమ మహాయాగానికి నాడు ఆయన శ్రీకారం చుట్టారు. ఆయన ఈ పాదయాత్ర ఒక కాంగ్రెస్ సైనికునిగా, నాయకునిగా, పీసీసీ అధ్యక్షునిగా ప్రారంభించారు.

## నా... మాట!

అపారమైన సంపద ఎప్పటినుండో కొంతమంది దగ్గరే మూలుగుతుంది..
తర,తరాలుగా పేద ప్రజలు బతుకు పోరాటం చేస్తున్నారు..
మధ్యతరగతి మానవుడు పెరిగిన పన్నుల బారాన్ని మోస్తూ,జీవితంతో కుస్తీ పడుతున్నాడు..
సంపన్నులు,ఇంకా సంపన్నులై ప్రపంచ కుబేరులతో పోటీ పడుతున్నారు..
తరగని ఖనిజా సంపద ఉన్నా,ఓడువని వనరులున్నా,రాజకీయాల మాయలో దేశం ఆస్తులు ఆవిరి అవుతున్నాయి..
దొంగలకు సద్దికడుతున్నా నాయకులు,
రోజురోజుకు రాష్ట్రాలను దివాళ తీస్తున్నారు..
విపరీతంగా అప్పులు చేసి,అధికారం కోసం,
పార్టీల ప్రయోజనాలకోసం,
రాజకీయంగా ఉనికిని చాటుకునేందుకు అధికారం ఉన్నప్పుడే ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారు..
ఎన్నో ఏండ్లుగా పేదోడు కనీసం స్వంత ఇల్లు నిర్మించుకునేందుకు నోచుకోక కిరాయి ఇండ్లలో బతుకులను వెళ్ళాదిస్తున్నారు..
అధికారంలోకి వచ్చేందుకు ప్రభుత్వాలు,
లెక్కలేనన్ని ఉచిత హామీలను ప్రకటించి,
రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారు...

పెద్దపల్లి రాజన్న...
:9848174314

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# నీలాంటి సైకోలు వెయ్యి మంది అడ్డుపడ్డా అమరావతి నిర్మాణం ఆగదు:

**భూ హక్కుపై తిరుగులేని భరోసా**

భూమి అనేది ఆస్తి మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి జీవనాధారం, గౌరవం, భద్రత అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం ప్రజల భూములపై కన్నేసి, రికార్డులను తారుమారు చేసి, గ్రామాల్లో భూవివాదాలకు తెరలేపిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సమస్యల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

"ప్రజల ఆస్తులకు భద్రత, జీవితాలకు భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. 2027 మార్చి నాటికి రాష్ట్రంలో కోటి 12 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలను పకడ్బందీగా అందించే బాధ్యత తీసుకుంటున్నాం" అని ప్రకటించారు. కరెన్సీ నోట్లకు వాడే టెక్నాలజీనే కొత్త పాస్‌బుక్‌లకు వాడుతున్నామని, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్, డిజిటల్ లాక్ వంటి సదుపాయాలతో వీటిని ఎవరూ తారుమారు చేయలేరని భరోసా ఇచ్చారు. మూడు దశల్లో ఈ–కేవైసీ ద్వారా యజమానిని నిర్ధారించుకున్న తర్వాతే పాస్‌బుక్‌లు ఇస్తున్నామని, ఈ ప్రక్రియలో ఒక్క రూపాయి కూడా అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తున్నామని వివరించారు.

**గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలా సర్వనాశనమైందని చంద్రబాబు మండిపడ్డారు. రాష్ట్ర విభజన కంటే దారుణమైన పరిస్థితులు గత ప్రభుత్వ హయాంలో నెలకొన్నాయని అన్నారు. "ఆడబిడ్డలకు రక్షణ లేదు, మాట్లాడాలంటే భయం. పరిశ్రమలు పారిపోయాయి, వ్యవస్థలన్నీ విధ్వంసమయ్యాయి" అని విమర్శించారు. తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని, వివేకానందరెడ్డి హత్య కేసులో తనను ఇరికించే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

"బాబాయిని చంపేసి ఆ నేరాన్ని నా మీద వేసి, నా చేతిలో కత్తి పెట్టి నరకాసుర రక్త చరిత్ర అంటూ వారి పత్రికలో రాశారు. ఇలాంటి పగటి వేషాలతో ప్రజలను ఏమార్చి గెలిచారు" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీని ఒక 'సైకో పార్టీ'గా అభివర్ణించిన ఆయన, ప్రతిపక్షంలో ఉన్నా బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి రాజకీయాలు రాష్ట్రానికి ప్రమాదకరమని హెచ్చరించారు.

**అమరావతి మనందరి రాజధాని**

అమరావతి నిర్మాణంపై తనకున్న నిబద్ధతను చంద్రబాబు పునరుద్ఘాటించారు. 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇస్తే, గత ప్రభుత్వం రాజధానిని నాశనం చేసిందని విమర్శించారు. అమరావతి రైతులు, మహిళలు పడిన కష్టాలను గుర్తుచేసుకున్నారు. "అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధాని అని నిన్ననే కేంద్ర ప్రభుత్వం రాజముద్ర వేసింది. అయినా ఇంకా మూడు ముక్కలాట అంటున్నారు. నీలాంటి వెయ్యి మంది సైకోలు అడ్డుపడ్డా అమరావతి నిర్మాణం ఆగదు" అని చంద్రబాబు సవాల్ విసిరారు.

అమరావతి కేవలం రాజధానే కాదని, హైదరాబాద్ తరహాలో సంపద సృష్టించే కేంద్రమని, దానిని పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును కూడా గత ప్రభుత్వం గోదావరిలో కలిపేసిందని, వేల కోట్లు ఖర్చు చేసి దాన్ని మళ్లీ గాడిన పెట్టి, గోదావరి పుష్కరాలలోగా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు.

**అధికారులకు క్లాస్.. అభివృద్ధిపై ఫోకస్**

ఈ సభలోనే చంద్రబాబు అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించడం విశేషం. వేమూరు నియోజకవర్గంలో ఆర్టీసీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, ఇరిగేషన్ వంటి శాఖలు రాష్ట్ర సగటు కన్నా మెరుగ్గా పనిచేస్తున్నాయని అభినందించారు. అదే సమయంలో, రేషన్ పంపిణీ, వ్యవసాయం, మధ్యాహ్న భోజన పథకం, రోడ్లు, ఇసుక సరఫరా వంటి అంశాల్లో వెనుకబడిన అధికారులను వేదికపైనే నిలదీశారు.

"ఇసుక ఉచితంగా ఇస్తుంటే, మీరు ప్రజలకు అందించకుండా చెడ్డపేరు తెస్తే ఎలా?" అని మైనింగ్ అధికారిని ప్రశ్నించారు. పనితీరు బాగోలేని శాఖలు వెంటనే గాడిన పడాలని, ప్రజలకు సేవ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మరోవైపు, రాబోయే ఐదేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని, సూర్యలంక బీచ్‌ను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

వేమూరుకు వరాల జల్లు

సభ ముగింపులో వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు పలు వరాలు ప్రకటించారు. బ్రాహ్మణ కోడూరు, కొల్లూరు వద్ద హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ. 25 కోట్లు, బట్టిప్రోలు–పెసర్లంక రోడ్డుకు రూ. 2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లంక గ్రామాల్లో భూమి కోతను నివారించేందుకు రూ. 2.54 కోట్లతో గ్రోయిన్‌ల నిర్మాణం చేపడతామన్నారు.

వేమూరులో కొత్త ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు, మూతపడిన జంపని షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు కూడా హామీ ఇచ్చారు. వరద నష్టపరిహారం బకాయిలను వెంటనే విడుదల చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా, తెలుగు జాతిని ప్రపంచంలోనే అగ్రగామి జాతిగా నిలబెట్టడమే తన లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# కేరళ, అసోం, పుదుచ్చేరిలో ముగిసిన పోలింగ్...

కేరళలో గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ప్రజాస్వామ్య పండుగగా అభివర్ణించే ఎన్నికల పర్వానికి కేరళలో గురువారం సాయంత్రం 6 గంటలకు అధికారికంగా తెరపడింది. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో సాయంత్రం 5 గంటల సమయానికి 75.01 శాతం ఓటింగ్ నమోదైంది. కోజికోడ్ జిల్లాలో అత్యధికంగా 77.63 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 75.75 శాతం పోలింగ్ నమోదవగా, ఈసారి కూడా తుది సంఖ్య 80 శాతం మార్కును దాటుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. అదే జరిగితే, 1987 తర్వాత 80 శాతం ఓటింగ్ దాటడం ఇదే తొలిసారి అవుతుంది.

పోలింగ్ ముగియడంతో, ఇప్పుడు అందరి దృష్టి మే 4న జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే ఉంది. రాబోయే ఐదేళ్లపాటు రాష్ట్ర సచివాలయాన్ని ఎవరు శాసిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్), తమ ప్రస్తుత 99 సీట్ల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేసింది.

మరోవైపు, కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోనీ, వీడీ సతీశన్ వంటి నేతల సారథ్యంలోని ప్రతిపక్ష యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), 100 సీట్ల మార్కును దాటి అధికారంలోకి వస్తామని ధీమాగా చెబుతోంది. ఈ రెండు కూటములకు భిన్నంగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా వేశారు. 2016లో ఒక్క సీటు గెలిచి, 2021లో దాన్ని కోల్పోయిన బీజేపీ అంచనాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి.

పుదుచ్చేరిలో రికార్డు బ్రేకింగ్ పోలింగ్

మరోవైపు, 30 అసెంబ్లీ స్థానాలున్న పుదుచ్చేరిలో రికార్డు స్థాయి ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలకే 86.92 శాతం పోలింగ్ నమోదవడం విశేషం. ఇది 2006లో నమోదైన 86 శాతం రికార్డును అధిగమించింది. తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తం 9.5 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో మహిళా ఓటర్లే అధికం.

అధికార ఎన్డీఏ కూటమి (ఏఐఎన్ఆర్‌సీ నేతృత్వంలో), ప్రతిపక్ష ఇండియా కూటమి (కాంగ్రెస్, డీఎంకే, వీసీకే) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీరితో పాటు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే), సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళ్ కట్చి (ఎన్టీకే) కూడా బరిలో నిలవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

అసోం, ఇతర ఉప ఎన్నికల్లోనూ భారీగా ఓటింగ్

అసోంలోని 126 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 84.42% పోలింగ్ నమోదైంది. సౌత్ సల్మారా మంకాచార్ జిల్లాలో అత్యధికంగా 94.08% ఓటింగ్ నమోదైంది.

ఇక వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో 65.68%, దావణగెరె సౌత్‌లో 63.04%, నాగాలాండ్‌లోని కొరిడాంగ్ స్థానంలో 80.62%, త్రిపురలోని ధర్మనగర్‌లో 79.84% పోలింగ్ నమోదైంది.

ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. మే 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా, మధ్యాహ్నానికి ఫలితాలపై స్పష్టత రానుంది. అప్పటి వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

# 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం...

ఉండవల్లిలో మంత్రుల బృందం, ఉన్నతాధికారులు, మెటా, యూట్యూబ్ వంటి ప్రముఖ సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పిల్లల్లో సృజనాత్మకత దెబ్బతినకుండా వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 13 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు వారి వయసుకు తగిన కంటెంట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచేలా విధివిధానాలు రూపొందించాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా మహిళల పట్ల అవమానకరమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లల డిజిటల్ భద్రతకు సంబంధించి ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి దేశాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు లోకేశ్ సూచించారు. వయసు నిర్ధారణ కోసం డిజిలాకర్‌తో అనుసంధానించిన 'ఏజ్ టోకెన్' విధానంపై దృష్టి సారించాలని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. పాఠశాలల్లో 'నో బ్యాగ్ డే' రోజున విద్యార్థులకు, పీటీఎం సమావేశాల్లో తల్లిదండ్రులకు దీనిపై అవగాహన కల్పిస్తామని వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులు... సున్నితమైన కంటెంట్‌ను పిల్లలకు దూరంగా ఉంచేందుకు తాము తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యాచరణకు తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చేయాల్సింది పాదయాత్ర కాదు... ఆత్మవిమర్శన యాత్ర:

ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చారిత్రాత్మక పాదయాత్ర చేపట్టి నేటికి 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, జగన్ విధానాలను, వైఎస్సార్ ఆశయాలను పోలుస్తూ షర్మిల సూటి ప్రశ్నలతో విరుచుకుపడ్డారు. తండ్రి పేరును పార్టీలో పెట్టుకుని, ఆయన ఆశయాలకు పూర్తిగా వ్యతిరేకంగా జగన్ పనిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఇవాళ ఏప్రిల్ 9! సరిగ్గా 23 సంవత్సరాల క్రితం మన తండ్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారు, అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో పాదయాత్ర అనే మహాయజ్ఞం మొదలుపెట్టారు. పేదల బాగు కోసం, బడుగుల మంచి కోసం, సకల జనుల సంక్షేమ మహాయాగానికి నాడు ఆయన శ్రీకారం చుట్టారు. ఆయన ఈ పాదయాత్ర ఒక కాంగ్రెస్ సైనికునిగా, నాయకునిగా, పీసీసీ అధ్యక్షునిగా ప్రారంభించారు. ఆ తర్వాత అయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి ముఖ్యమంత్రిగా చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. మరి అటువంటి తండ్రికి కుమారునిగా, పార్టీ పేరులో ఆయన పేరును పొందుపర్చి మీరు నేడు చేస్తున్నది ఏమిటి? ఆజన్మాంతం పేదలు, దళితులు, మైనారిటీలు, మహిళలు, రైతులు, ఎస్టీలు, వీరి కోసం తపించి, తన పాలనలో వీరికోసం ఎన్నో పథకాలను రచించిన ఆయన ఎక్కడ, నేడు ఫాసిస్టు శక్తులకు తలవంచి వాళ్ళ క్యాపిటలిస్టు పోకడలకు దాసోహం అయిన మీరెక్కడ? లౌకికవాదాన్ని తన ఊపిరిలో నింపుకుని, అన్ని వర్గాలవారిని సమానంగా ఆదరించి, ప్రజల ఐక్యత కోసం పాటుపడింది వైఎస్సార్, మరి అయన తనయునిగా మీరు నేడు చేస్తున్నది ఏమిటి? మతోన్మాద బీజేపీ దగ్గర కేసులకు, రాజకీయ భవిత కోసం భయపడి మోకరిల్లడం. ఇది ఎంత వరకు ధర్మం? బీజేపీ ప్రతి చర్యలో దళిత, మైనారిటీ వ్యతిరేక పోకడలు ఉన్నాయ్. వక్ఫ్ చట్టం అయితేనేమి, దళిత క్రిస్టియన్ రిజర్వేషన్లు ఐతేనేమి, ఎఫ్ సీఆర్ఏ చట్టం అయితేనేమి, బుల్ డోజర్ రాజకేయాలితేనేమి. వీటన్నిటికి గల్లీలో మౌనం వహించి, ఢిల్లీలో బేషరతు మద్దతు ప్రకటించిన మీరా ఆయనకు నివాళి అర్పించేది ఇవాళ? ఆయనబతికుంటే ఇవి హర్షించేవారా? ఇది ఆయన ఆదర్శాలకు, అభిమతాలు పూర్తి వ్యతిరేకం కదా? ఇక మీ ఐదేళ్ల పాలనలో సభ్యసమాజం సిగ్గుపడేలా దళితుల మీద, మహిళల మీద జరిగిన దాడులు, చివరికి మైనార్టీల మీద కూడా జరిగిన అక్రమాలు, ఇవన్నీ రాజశేఖర రెడ్డిగారి ఆత్మ క్షోభించే పనులు కాదంటారా? అణువణువునా రాజశేఖర రెడ్డిగారి పాలనకు, ఆలోచనలకూ భిన్న ధ్రువంగా ఉంటూ మీరు ఇవాళ అయన పాదయాత్రను తల్చుకుని నివాళులు అర్పించడం హాస్యాస్పదంగా ఉంది. మొన్న ప్రకటించినట్టు మీరు చేయాల్సింది పాదయాత్ర కాదు, ఆత్మవిమర్శన యాత్ర" అంటూ షర్మిల పేర్కొన్నారు.

# మీడియాపై ఏ పార్టీ దాడి చేసినా నేను ఖండిస్తా:

మీడియా స్వేచ్ఛ, మాతృభాష ప్రాముఖ్యతపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. చిత్తూరులోని ఎస్వీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన, నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవల మీడియా సంస్థలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఆయన స్పందిస్తూ... వార్తల్లో అసత్యాలు ఉంటే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉంటుందని, కానీ భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదని హితవు పలికారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యలను ఏ రాజకీయ పార్టీ చేసినా తాను తీవ్రంగా ఖండిస్తానని స్పష్టం చేశారు. మాతృభాషను మర్చిపోవడం అంటే అమ్మను మర్చిపోవడమేనని, జన్మనిచ్చిన తల్లిని, ఊరిని, దేశాన్ని ఎప్పుడూ గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియా ఊబిలో పడి సమయాన్ని వృథా చేయవద్దని, చదువుతో పాటు ఆటలకు, యోగాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాజకీయ వారసత్వానికి తాను వ్యతిరేకినని, అయితే సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాలను ప్రోత్సహిస్తానని వెల్లడించారు. ఆహారపు అలవాట్లను మార్చుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# సంఘటనా స్థలంలోనే కేసు నమోదు 'ఆన్ సైట్ ఎఫ్ఐఆర్ ధానం ప్రారంభం

రంగారెడ్డి జిల్లా బ్యూరో

ప్రజలకు వేగవంతమైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో పోలీసులు కొత్తగా ఆన్ సైట్ ఎఫ్ ఐ ఆర్ (సంఘటనా స్థలంలోనే కేసు నమోదు) విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఈ విధానం ద్వారా ఘటన చోటుచేసుకున్న ప్రదేశంలోనే ఫిర్యాదు స్వీకరించి వెంటనే కేసు నమోదు చేసే అవకాశం కల్పించడంతో, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపడుతున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండన్నగూడ గ్రామంలో ఈ విధానం అమలులో భాగంగా ఒక కేసు నమోదు చేశారు. బాధితురాలు వీరమ్మ తెలిపిన వివరాల ప్రకారం, గురువారం మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో ఆమె పొలం వద్ద కూర్చుని ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి మెడలో ఉన్న సుమారు 4 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. సమాచారం అందిన వెంటనే షాద్‌నగర్ ఏసీపీ సత్యనారాయణ, సీఐ సీతారాం, ఎస్సై శివారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అక్కడికక్కడే ఆన్ సైట్ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రజల భద్రత కోసం ఇలాంటి ఆధునిక విధానాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని పోలీసులు తెలిపారు.

# బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధిస్తుంది:

. ఇప్పుడు భవానీపూర్‌లో (మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు) కూడా అదే ఫలితం వస్తుందని అన్నారు. ఈ ఎన్నికలు బెంగాల్ అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఉపయోగపడే ఎన్నికలు అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధి విషయంలో అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు రంగాల్లో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ మోసాలు ప్రజల ముందు ఉంచుతామని మోదీ పేర్కొన్నారు. బెంగాల్ యువతను తృణమూల్ కాంగ్రెస్ ఎంతో మోసం చేసిందని, ఆ పాపాలు ఊరికే పోవని హెచ్చరించారు. బెంగాల్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ రాగానే కేంద్ర పథకాలు ఇక్కడ అమల్లోకి వస్తాయని హామీ ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ హయాంలో జరిగిన అన్యాయాలు, కుంభకోణాలపై విచారణ జరిపి, కారకులైన వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. శరణార్థులకు ఆశ్రయమిస్తామని, కానీ చొరబాటుదారులను తరిమికొడతామని స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
శుక్రవారం 10 ఏప్రిల్ 2026

# కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే విష సర్పాలు వ్యాఖ్యలను ఘోరంగా ఖండించారు

**--మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా బి. జె.పి ఓ.బి.సి మోర్చా సోషల్ మీడియా కో కన్వీనర్ తోలుపు నూరి రమేష్ గౌడ్**

హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) హైదరాబాద్

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే 'విష సర్పాలు' వ్యాఖ్యలను ఘోరంగా ఖండించారు

భారతీయ జనతా పార్టీ ఓ.బి.సి మోర్చా మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ తోలుపు నూరి రమేష్ గౌడ్,కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే గారి భిన్నమైన, దారుణమైన వ్యాఖ్యలను తీవ్రంగా నిరసిస్తూ, వాటిని పూర్తిగా ఖండించారు. బి.జె.పి ఆర్.ఎస్.ఎస్ నాయకులను 'విష సర్పాలు'గా పేర్కొన్న ఖార్గే ఉద్దేశపూరిత విష వాక్యాలు దేశ రాజకీయాల్లో మాతృభూమి గౌరవాన్ని, జాతీయ సద్భావాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. ఈ రకమైన విరుద్ధ మతాలపై దౌర్జన్యాన్ని ప్రోత్సహించేలా అనిపించే మాటలు చెప్పడం ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడికి ఏ క్రమం ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్ సమావేశంలో ప్రతిపక్షాలు, సామాన్య ప్రజలపై దాడి చేసేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావడం ఇప్పటికే తెలిసింది. ఇప్పుడు కాంగ్రెస్ అగ్ర నాయకుడు దీపూ–=ూ నాయకులపై దుర్మార్గ వ్యాఖ్యలు చేస్తున్నాడంటే, ఈ చట్టాలు కేవలం ప్రతిపక్షాలను, హిందూ సంస్కృతి రక్షకులను అణచివేయడానికేనాఇది దేశవ్యాప్తంగా మత ద్వేషాన్ని కలిగించే కుట్రగా కనిపిస్తోంది. తోలుపు నూరి రమేష్ గౌడ్ మాట్లాడుతూ, "బాధ్యతాయుతంగా ఉండాల్సిన ఒక పార్టీ అధ్యక్షుడు ఇలాంటి విషపూరిత మాటలు మాట్లాడటం దేశ డెమాక్రసీకి మాయమే ఖార్గే తమ పార్టీలోనే అంతర్గత కలహాలకు తగిన చర్యలు తీసుకోకుండా, జాతీయ స్థాయి నాయకులను విష సర్పాలుగా చిత్రీకరించడం దారుణం. ఇది ఆపకపోతే, మేము ఎన్నికల సంఘానికి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని" హెచ్చరించారు. బిజెపి ఓ.బి.సి మోర్చా, మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా నాయకత్వం ఈ ఘటనపై తీవ్రంగా ప్రతిస్పందిస్తూ, కాంగ్రెస్ నాయకత్వానికి ఈ విష భాషణలు



వద్దని, దేశ సామరస్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తోంది.

# ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి ఫారెస్ట్ పోడు భూములకు పట్టాలివ్వాలి

**గోపినాయక్ తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు**

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్

అమ్రాబాద్ మండలం లో తెలంగాణ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ పరిషత్ చైర్మన్ రాంచందర్ రెడ్డి గారికి వినీత్తి పత్రం యం గోపినాయక్ అందజేశారు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు పోడు హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వనికి కోర్యారు అనేక సంవత్సరాల నుండి పోడు భూములను సాగు చేస్తున్నారు. అటువంటి భూములకు చాలావరకు పట్టాలు రాలేదు. తక్షణమే రెండవసారి వారిని గుర్తించి సాగు చేస్తున్నటువంటి భూములకు పట్టాలు ఇవ్వాలని మీ ద్వారా కోరుతున్నాము. మరియు ఎక్కువ శాతం అసైన్డ్ భూములు ఉన్నాయి ఈ భూములు ఉన్న వారి పేరు మీద కాకుండా భూమి లేని వారి పేర్ల మీద కూడా పట్టాలిచ్చారు. ఇది పూర్తిగా అధికారుల తప్పిదంగా ఉన్నది. భూమిలేని వాళ్లకు భూములు ఉన్నట్టుగా పట్టాలు ఇచ్చారు. దీనితో అసలైన పట్టాదారులకు భూమి రాకపోవడంతో అనేకసార్లు మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఏజెన్సీ మండలంలో 30% దాకా ఈ సమస్య ఉన్నది. అటువంటి భూములకు ప్రత్యేకంగా పర్యవేక్షించి వారికి న్యాయం జరిగే విధంగా సమస్యను పరిష్కరించే విధంగా తమ ద్వారా పరిష్కారం చేయాలని కోరుతున్నాము అని గిరిజన సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏం గోపి నాయక్ తెలిపారు



# మెదక్ డివిజన్ విద్యుత్ కార్యాలయం ముందు రెండవ రోజు ఆర్టిజన్ల నిరవధిక సమ్మె

మెదక్,ఏప్రిల్09(హైద్రాబాద్ ఎస్టేట్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెదక్ డివిజన్ విద్యుత్ కార్యాలయం ముందు రెండవ రోజైన గురువారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టి వివిఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టిజన్ లు మాట్లాడుతూ ఆర్టిజన్లకు నిబంధనల ప్రకారం ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, 2026 పిఆర్సి,మెడికల్ లీవులు మంజూరు,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. గ్రేడ్ చేంజ్ పీస్ రేటు కార్మికులకు,అన్ మ్యాన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోల్ టు పోల్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వినియోగదారులకు 24గంటలు





నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నా,తాము మాత్రం చాలీ చాలని జీతంతో జీవితాలను నెట్టు కొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనారాష్ట్ర ప్రభుత్వం,యాజమాన్యం కల్పించుకుని తమకు రావాల్సిన న్యాయ పరమైన హక్కులను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మహిళా ఆర్టిజన్లు ప్రణీత,స్వప్న, జ్యోతి,సుమలత, మానస,నాగమణిజెఏసి నాయకులు జంగం శరత్, పృథ్వీ గౌడ్,శ్రీశైలం శ్రీనివాస్,నాగరాజు,రమావత్ హరినాయక్,వెంకట చారి,సత్యంగుప్తా, మొగులయ్య,రాజు గౌడ్,శంకరప్ప,పరశురామ్, ఫోల్కంపేట వేణుగోపాల్, నర్సింలు, సుధాకర్,సాయిలు, యాదగిరి,తదితరులు పాల్గొన్నారు. రెండవ రోజు డివిజన్ కార్యాలయం ముందు కార్మికుల వంటా వార్పు కార్యక్రమం కొనసాగింది

# బీఆర్ఎస్ విజయ గర్జన:

**ఇబ్రహీంపట్నంలో ఊపందుకున్న రాజకీయ ఉత్సాహం**

**లిమంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ని అభినందించిన కల్వకుంట్ల తారక రామారావు**

(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఏప్రిల్ 9:-

ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలు స్థానిక రాజకీయాల్లో ఒక కీలక మలుపు తిప్పాయి. ఈ ఎన్నికల్లో గులాబీ పార్టీ ఘన విజయం సాధించడం ద్వారా అక్కడి రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచిన రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి తన వ్యూహాత్మక ఆలోచనలు, క్రమబద్ధమైన ప్రణాళికలు మరియు కార్యకర్తలతో సమన్వయం ద్వారా పార్టీకి బలమైన స్థానం కల్పించారు. పార్టీకి ఈ విజయాన్ని అందించినందుకు గాను, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ విజయంతో ఇబ్రహీంపట్నం ప్రాంతంలో పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం, నమ్మకం పెరిగింది. నాయకత్వం పట్ల విశ్వాసం మరింత బలపడింది. ఇక ఈ విజయోత్సాహాన్ని మరింత పెంచే దిశగా, ఈ నెల 11వ తేదీన కేటీఆర్ పర్యటన జరగనుంది. ఈ పర్యటనలో భాగంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. ఈ సందర్శన ద్వారా పార్టీ శక్తిని మరింత బలోపేతం చేయడం, ప్రజలతో అనుబంధాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, ఇబ్రహీంపట్నం రాజకీయ వాతావరణం మరింత చురుకుదనంతో ముందుకు సాగుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ నాచురల్ గ్యాస్ విస్తరణకు చర్యలు

**-జిల్లాలో పైప్‌లైన్ గ్యాస్ వినియోగం పెంపుపై అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు**

(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఏప్రిల్ 9:-

తేదీ: 09-04-2026, రంగారెడ్డి జిల్లా

ఎల్పీజీ గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ నాచురల్ గ్యాస్ వ్యవస్థీకరణకు అన్ని శాఖలు సమన్వయంతో సహకరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో చంద్రా రెడ్డి అధ్యక్షతన పైప్‌లైన్ నాచురల్ గ్యాస్ వ్యవస్థీకరణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వంటగ్యాస్ వినియోగంలో ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించాలని అన్నారు. రోడ్లు, నేషనల్ హైవేలు మరియు ఇతర ప్రాంతాల్లో పైప్‌లైన్ నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు పైప్‌లైన్ గ్యాస్ వినియోగంపై ఆసక్తి చూపేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, నిర్మాణ సమయంలో ఎదురయ్యే ఆటంకాలను సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో పైప్‌లైన్ గ్యాస్ వినియోగాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని శాఖలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, సివిల్ సప్లై



అధికారి వనజాత, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కొలంబో మేయర్‌ని కలిసిన విజయ్ వర్మ

హైదరాబాద్, ఏప్రిల్ 09: శ్రీలంక పర్యటనలో భాగంగా ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త , సినీ దర్శక నిర్మాత వీస్ విజయ్ వర్మ పాకలపాటి కొలంబో మేయర్ వ్రేయిల్ క్యాలీ బాల్తాజార్ ని కలిసి కొలంబో నగరపాలిక సంస్థ వ్యవహార శైలిని అభినందించారు. సిటీని ఏంతో సుందరంగా తీర్చిదిద్దిన తీరుని అభినందించారు. అవినీతిరహితంగా వ్యవహరిస్తూ నగరపాలిక సంస్థను సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా నిరంతర కృషి చేస్తున్న పాలకమండలిని విజయ్ వర్మ అభినందించారు. ఈ సందర్భంగా కొలంబో మేయర్ వ్రేయిల్ క్యాలీ బాల్తాజార్ ఇండియా లోని పలు నగరపాలిక సంస్థలలో అమలవుతున్న నూతన ఆవిష్కరణల గురించి ముఖ్యంగా వేస్ట్ మానేజ్మెంట్, సోలార్ వ్యవస్థల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా విజయ్ వర్మ శ్రీలంక ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ని సందర్శించి త్వరలో కొలంబో లో నిర్వహించనున్న ఇండో - శ్రీలంక ఫిల్మ్ ఎక్స్ చేంజ్ - 2026 గురించి చర్చించారు.



# మహిళా రిజర్వేషన్‌పై కేంద్ర విధానం ఏకపక్షం: కవిత విమర్శ

**లిఓబీసీ లెక్కల తరువాతే మహిళా కోటా అమలు చేయాలి: కవిత డిమాండ్**

(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఏప్రిల్ 9:-

హైదరాబాద్‌లో విడుదల చేసిన విలేకరుల సమావేశంలో కవిత, మహిళల రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. 2011 జనాభా గణాంకాల ఆధారంగా ఈ బిల్లును అమలు చేయాలనుకోవడం సరైన నిర్ణయం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. తాజా జనగణనలో ఓబీసీలను ప్రత్యేకంగా గుర్తించే విధంగా లెక్కలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కులాల వివరాలు ఉన్నప్పటికీ, ఓబీసీలకు ప్రత్యేక వర్గీకరణ లేకపోవడం వల్ల వారి ఖచ్చితమైన జనాభా వెలుగులోకి రావడం లేదని పేర్కొన్నారు. మహిళల రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉపకోటా కల్పించాలంటే ముందుగా వారి జనాభా గణాంకాలు స్పష్టంగా ఉండాలని ఆమె అన్నారు. ఈ అంశంపై కేంద్రం అన్యాయం చేస్తోందని విమర్శిస్తూ, బీసీ మహిళలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఇక, మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి రూపొందించిన ముసాయిదాను పార్లమెంట్ సమావేశాలకు ముందే అన్ని రాజకీయ పార్టీలకు అందించాలని ఆమె కోరారు. చర్చ జరిగే రోజే బిల్లును ఇవ్వడం సరైంది కాదని, ఇది అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశాన్ని తగ్గించే ప్రయత్నమని అన్నారు. ఈ విషయంలో ఇతర పార్టీల మద్దతు కూడగట్టేందుకు దేశవ్యాప్తంగా నాయకులతో చర్చలు జరుపుతానని తెలిపారు.


మహిళా బిల్లుకు తమ సంస్థ కీలకంగా కృషి చేసిందని ఆమె గుర్తుచేశారు. ఢిల్లీలో నిర్వహించిన నిరసనల ద్వారా పలు పార్టీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చామని చెప్పారు. ఈ ప్రయత్నాల ఫలితంగా దేశవ్యాప్తంగా మహిళలకు ప్రయోజనం కలుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.



# పలు వివాహ శుభకార్యాలలో పాల్గొన్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీ దేవమ్మ

పత్తికొండ

పత్తికొండ నియోజకవర్గం లోని క్రిష్ణగిరి మండలం అమకతాడు ఉప్పరి నాగేశ్వరరావు కుమారుడు వివాహానికి మంగంపల్లి సమీపంలో ఉన్న విసీఎన్ ఫంక్షన్ హాల్ నందు తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామం శ్రీ బచ్చల సురేష్ కుమార్తె వివాహానికి అనంతపురం జిల్లా పామిడి లో వరుడు స్వగృహం నందు హాజరై నూతన వధూవరులను పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు ఆశీర్వదించారు. అనంతరంక్రిష్ణగిరి మండలం కోయిలకొండ గ్రామం వైయస్సార్ పార్టీ బాలమద్దయ్య కుమారుడు వివాహానికి హాజరై నూతన వధూవరులను మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు, క్రిష్ణగిరి ఎంపీపీ డాక్టర్ వెంకటరామిరెడ్డి గారు ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం

## రోడ్డు భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఏప్రిల్ 9:- రంగారెడ్డి జిల్లా: 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో దృశ్య సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతపై పలు చర్యలు చేపడుతున్నప్పటికీ రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. వాహనాల సంఖ్య పెరగడం, అధిక వేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్లు రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు కనుగొనాలని ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలను తక్షణమే నిర్వహించి వారాంతర "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు వివిధ కార్యాచరణలు చేపడతారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను రక్షించడం, సురక్షిత రహదారుల ఏర్పాటే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. రాష్ట్ర పోలీసు ప్రధాన అధికారి శివధర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం సాధారణం కాదని, పలు శాఖల సమన్వయంతో కూడిన సమగ్ర చర్య అని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు బాధితులవుతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన అత్యవసరమని పేర్కొన్నారు. గత మూడు నెలల్లో రోడ్డు భద్రత చర్యల్లో గణనీయ పురోగతి సాధించినట్లు వెల్లడించారు.

కార్యక్రమ షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి:
- ఏప్రిల్ 13: గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు
- ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద రోడ్డు భద్రత ప్రమాణం
- ఏప్రిల్ 15: పిల్లల రోడ్డు భద్రత దినోత్సవం నాలుగేళ్లకు పైబడిన పిల్లలకు సీటు బెల్ట్ వినియోగంపై అవగాహన



- ఏప్రిల్ 16: ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక ప్రచారం హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగ ప్రోత్సాహం, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన
- ఏప్రిల్ 17: ప్రమాదాల తర్వాత తక్షణ సహాయం కోసం "సువర్ణ గంట" అత్యవసర స్పందన శిక్షణ
- ఏప్రిల్ 18: ట్రాఫిక్ ఉల్లంఘనదారులకు మార్గదర్శక కార్యక్రమాలు ప్రవర్తనలో మార్పు, నియమాల పాటింపు

ఈ దృశ్య సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి శ్రీనివాస్, జిల్లా ఆదాయ అధికారి సంగీత, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, రోడ్డు భద్రత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వికలాంగుల సంక్షేమానికి పెద్దపీట

### ముత్తినేని వీరయ్యను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

హైదరాబాద్ఎస్టేట్ ప్రతినిధి, ఏప్రిల్ 9: వికలాంగుల సంక్షేమం మరియు వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, అందుబాటులో ఉండే నాయకుడు శ్రీ ముత్తినేని వీరయ్య గారిని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు రేవంత్ రెడ్డి వికలాంగుల ఉద్యోగ సంఘాల నాయకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

హైదరాబాద లో నిర్వహించిన సమావేశంలో వికలాంగుల ఉద్యోగ సంఘాలు అయిన వివిధ వర్గాలప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముత్తినేని వీరయ్య గారు ఎప్పటికప్పుడు వికలాంగుల సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు.

వీరయ్య గారి నియామకం వల్ల వికలాంగుల సంక్షేమ కార్యక్రమాలు మరింత బలోపేతం అవుతాయని, ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుకునే అవకాశాలు పెరుగుతాయని నాయకులు పేర్కొన్నారు.అలాగే, ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వం వికలాంగుల పట్ల తన నిబద్ధతను మరోసారి చాటిందని వారు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో



కూడా వికలాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం మరిన్ని సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీతో పాటు ప్రభుత్వంపై సబితా ఇంద్రారెడ్డి ఘాటు విమర్శలు

### -మహిళా సంక్షేమంపై ప్రభుత్వం విఫలం బాలాపూర్ కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యలు

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఏప్రిల్ 9:- మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం మహిళా సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమానికి వేదికగా మారింది. అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మిషాదీ ముబారక్ పథకాల కింద ఆర్థిక సహాయంగా చెక్కులను అందజేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి స్వయంగా హాజరై మొత్తం 103 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిరా దేవి, ఇతర అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమ ప్రాంగణంలో ఆనందకర వాతావరణం నెలకొనగా, లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సహాయంపై తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పాలనపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు. నాయకత్వంలో ప్రారంభమైన సంక్షేమ పథకాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయని, కొత్తగా ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ఎలాంటి వినూత్న చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి అన్ని రంగాల్లో నెమ్మదిగా సాగుతోందని పేర్కొన్నారు.

ప్రత్యేకంగా మహిళల సంక్షేమంపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఆమె తప్పుబట్టారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ముఖ్యంగా "తులం బంగారం" వాగ్దానం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని గుర్తుచేశారు. రెండున్నర సంవత్సరాల కాలంలో ఒక్క మహిళకైనా ఆ హామీ అమలు కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలను ఆర్థికంగా బలపరుస్తామని గొప్పగా చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఎంతమందిని కోటీశ్వరులుగా తయారు చేసిందో స్పష్టంగా చెప్పాలని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయని, వాటికి ప్రభుత్వం సమాధానం



చెప్పాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఇక కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చే కార్యక్రమాలుగా నిలిచాయని ఆమె తెలిపారు. ఇలాంటి పథకాలను మరింత బలోపేతం చేసి లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు ఇతర ప్రముఖులు కూడా పాల్గొని లబ్ధిదారులకు అభినందనలు తెలియజేశారు

# మొక్కజొన్న రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి- సిపిఎం

ఎమ్మిగనూరు ఏప్రిల్ 9 (హైద్రాబాద్ ఎస్టేట్):
ఎమ్మిగనూరు : ఏప్రిల్ 9
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ ప్రభుత్వాన్ని గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంట రబి సీజన్లో రైతులు వ్యాపారస్తుల మాట విని పెద్ద ఎత్తున పంటలు పండించారు. ఒక ఎకరాకు 20 నుండి 40 కింటాళ్ల వరకు పంట పండించారు. ప్రతి రైతు ఎకరాకు 50 వేల రూపాయల చొప్పున పెట్టుబడి ఖర్చులు చేశారు. విత్తనాల కంపెనీల వారు మొక్కజొన్న సరుకును పండిన తర్వాత తామే గిట్టుబాటు ధర కల్పించి కొంటామని చెప్పి హామీ ఇచ్చారు. తీరా పంట చేతికి వచ్చాక గిట్టుబాటు ధర కల్పించకపోవడం పక్కనపెట్టి, కనీసం పండించిన పంటను కొనడానికి కూడా ముందుకు రాకపోవడంతో మొక్కజొన్న రైతు తీవ్రమైన కష్టాలకు, ఇబ్బందులకు, అప్పులకు గురి అయ్యి మోసపోయారు. కనీస మద్దతు ధర 3800 రూపాయల క్వింటానికి ఇవ్వవలసింది పోయి కుంటాలు 1500 నుండి 1700 వరకు కొనడం చాలా అన్యాయం అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రైవేటు విత్తన కంపెనీలతో కుమ్మక్కై రైతు నోటా మట్టి కొడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే రైతులు పండించిన పంటను వ్యాపారస్తులు ప్రభుత్వము కొనక పోవడం వల్ల ఎండలకు క్వింటాలకు ఐదు కేజీల చొప్పున తూకం తగ్గాయని తెలియజేశారు. గతంలో విత్తనాల కంపెనీల వారు దైవందిన్నె గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఐజ కు సంబంధించిన వ్యాపారస్తులు సీడు మొక్కజొన్న విషయంలో కంపెనీ గ్యారెంటీ ఇచ్చిన నాణ్యతలేని విత్తనాల వల్ల పంట రాలేక రైతులని మోసగించిన ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆరోపించారు. ప్రస్తుతం రైతు మొక్కజొన్న రైతులు పండించిన పంటను కంపెనీల వారు కొనుగోలు చేస్తామని మోసం చేసిన ప్రభుత్వ నిమ్మకు నేరెత్తినట్లు ఉండటం ఏం న్యాయమని ప్రశ్నించారు. నష్టపోయిన మొక్కజొన్న రైతుని ఆదుకొని కంపెనీల వారికి చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. మొక్కజొన్న రైతుకు కనీస మద్దతు ద్వారా ఇవ్వకపోతే మొక్కజొన్న రైతులందరినీ సమీకరించి కర్నూలు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులకు మద్దతు ధర విషయంలో ప్రభుత్వాలు వ్యవహార శైలి రైతులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. పత్తి పంట బాగా పండిన పండించిన రైతుకు గిట్టుబాటు ధర 7వేల రూపాయలు ఇచ్చి పత్తి పంట తగ్గిన తర్వాత 9000 రూపాయలకు పెంచటం ఏం న్యాయమని ప్రశ్నించారు. ఉల్లి, మిర్చి రైతులకు కూడా గిట్టుబాటు ధరల విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. గిట్టుబాటు ధరల విషయంలో పంటలను ఆదుకునే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులు అందించాల్సిన సహకారం అధికారులు ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గిట్టుబాటు ధరల పైన కమిషన్ వేసి బాధ్యులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు గోవిందు, రాముడు, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, లక్ష్మీ నరసయ్య రమేష్ పాల్గొన్నారు.

# మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

### -సాయంత్రం వాహనాల తనిఖీలు తప్పనిసరి...
### -మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు .





మెదక్,ఏప్రిల్09(హైద్రాబాద్ ఎస్టేట్):
మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు గురువారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.మొదటగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన పరిశుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.అనంతరం స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని,ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజలకు త్వరగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరుపై ఎస్‌హెచ్‌ఓ మహేష్ నుండి వివరాలు తెలుసుకొని,సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు.ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రతిరోజూ సాయంత్రం వాహనాల తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఎస్పి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని హితవు పలికారు.అప్పగించిన విధులను సమయానికి పూర్తి చేయాలని,అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని,సామాజిక విఘాతం కలిగించే అంశాలపై ముందస్తు సమాచారం సేకరించేందుకు పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటుచేయాలని సూచించారు.ఎస్పీ వెంట మెదక్ పట్టణ ఇన్స్పెక్టర్ మహేష్,ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి,ఎసైలు మల్లికార్జున్,విఠల్ సిబ్బంది ఉన్నారు.

## పేదింటి ఆడబిడ్డ వివాహానికి 50,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన BRS రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్

దేవరకొండ మండలం లోని గన్యా నాయక్ తండా గ్రామం లోని సీతారాం తండా కి చెందిన కొర్ర కిషన్ నాయక్ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువు వరులను ఆశీర్వదించిన దీ=హా రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ ఈ సందర్భంగా పేదింటి ఆడబిడ్డకి వివాహ వేడుకకు 50,000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు ఆయన వెంట పార్టీ నాయకులూ , కార్యకర్తలు ఉన్నారు



## 11న ప్రజా అవగాహన సదస్సు



హైదరాబాద్, ఏప్రిల్ 09: తెలంగాణ ప్రభుత్వం ఔషధ నియంత్రణ శాఖ, తెలంగాణ చాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఆధ్వర్యంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీన శనివారం ఉదయం 9 గంటలకు కింగ్ కోఠిలోని కెమిస్ట్ భవన్ లో మాదక ద్రవ్యాల నియంత్రణ అండ్ నియంత్రణ బలోపేత దినోత్సవం అనే ప్రజా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అబిడ్స్ తాజ్ మహల్ హోటల్ నుంచి కెమిస్ట్ భవన్ వరకు అవగాహన ర్యాలీ ఉంటుందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా అలవాటుగా మారే ఔషదాల దుర్వినియోగాన్ని నివారించడం, సురక్షితమైన, నాణ్యమైన ఔషదాల లభ్యతను నిర్ధారించడం దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సదస్సు పోస్టర్ ను గురువారం వారు అవిష్కరించారు. ఈ సదస్సులో తెలంగాణ మత్తుపదార్థాల నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు టి.రాజమౌళి, డ్రగ్ ఇన్స్పెక్టర్స్ వి.అజయ్, ఇ.తిరుపతి, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అధ్యక్షులు డాక్టర్ ఫిసులాల్ జైన్, ప్రధానకార్యదర్శి సంజయ్ కుమార్ మోడీ, కోశాధికారి సిహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్, సలహా కమిటీ చైర్మన్ మందా సూర్యప్రకాష్, సభ్యులు సంజయ్ కుమార్ జైన్, ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

## గ్రామాలాభివృద్ధికి సర్పంచుల సేవలు అమూల్యం

### -సభలో ఎమ్మెల్యే ఎంజీఆర్ ప్రశంసలు...

పాతపట్నం (హైద్రాబాద్ ఎస్టేట్):
పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు కొత్తూరు మండలం గ్రామ పంచాయతీ సర్పంచ్ ల పదవీ కాల ఆత్మీయ వీడ్కోలు సభలో పాల్గొన్నారు.అనంతరం సర్పంచుల పరిపాలన విధానం,గ్రామాభివృద్ధిలో వారు చేసిన సేవల గురించి మాట్లాడి, వారి కృషిని ప్రశంసించారు.గ్రామ స్థాయి అభివృద్ధికి సర్పంచులు కీలక పాత్ర పోషించారని, వారి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచులను సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, మెమొంటోలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల అధికారులు,ఎన్డీఏ కూటమి నాయకులు, సర్పంచులు,సర్పంచు ప్రతినిధులు, వార్డు మెంబర్స్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీ ఎమ్మార్పీఎస్ పునర్నిర్మాణానికి కార్యకర్తలు సిద్ధం కావాలి

## - ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాన్యశ్రీ దండు వీరయ్య







దువ్వూరు ఏప్రిల్ 9(హైద్రాబాద్ ఎస్టేట్): ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాన్యశ్రీ దండు వీరయ్య మాదిగ నాయకత్వంలో గురువారం దువ్వూరు మండలం లోని బండి వారి కళ్యాణమండపంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సి వెంకటనారాయణ మాదిగ మరియు జిల్లా కార్యదర్శి సారబాల నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో కడప జిల్లా ఏపీ ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దళితరత్న అవార్డు గ్రహీత మాన్యశ్రీ దండు వీరయ్య మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏపీ ఎమ్మార్పీఎస్ ఉద్యమ పునర్నిర్మాణానికి కార్యకర్తలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు గ్రామ కమిటీలు వేయాలని కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు. జిల్లాలో ఉన్నటువంటి రాష్ట్ర జిల్లా నాయకులను జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి నియోజకవర్గాల ఇన్చార్జిలను నియమిస్తానని తెలియజేశారు. అదేవిధంగా యుగానికి ఆరంభం ఉగాది. ఉగాది పర్వదినాన జలమే తల్లిగా శంఖ మే తండ్రిగా జలప్రళయంలో స్వయంభుగా ఉద్భవించిన మాదిగల మూలపురుషుడైన శ్రీ శ్రీ ఆది జాంబవంతుని జయంతినీ పురస్కరించుకొని జూన్ 15 2026 తేదీన అఖిలభారత ఆది జాంబవ మాదిగల దినోత్సవాన్ని చెన్నైలో నిర్వహించబోతున్నామని ఈ సమావేశానికి దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, కేరళ ,తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుంచి మాదిగ ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డప్పు చర్మకారుల రాష్ట్ర అధ్యక్షులు కే నాగభూషణం మాదిగ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి వో సి ఎల్లయ్యమాదిగ రాష్ట్ర కార్యదర్శి సాకే బాల లక్ష్మయ్య మాదిగ రాష్ట్ర కార్యదర్శి , బి ఎస్ కర్ణ మాదిగ రంగ గాళ్ళ నరసింహులు మాదిగ, నాగిపోగు వెంకటలక్ష్మమాదిగ రమాదేవి మాదిగ దుబ్బల్ల వెంకటరమణ బాల పెద్దన్న కామనూరు చిన్నయ్య మాదిగ, శ్రీరామ ఓబులేష్ మాదిగ, జిల్లా జిల్లా కార్యదర్శి ఆరోగ్యం మాదిగ చింతకుంట ఓబయ్య మాదిగ మదూరు ఓబయ్య మాదిగ వెంకటసుబ్బయ్య మద్దిలేటి బయనపల్లె మరియు ఇతరులు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లె వారపు సంత, గేటు వేలం పాటలు రసాభస



తంబళ్లపల్లె ఏప్రిల్ 9 (హైద్రాబాద్ ఎస్టేట్): ;తంబళ్లపల్లె పంచాయతీ వారపు సంత, బస్టాండ్ గేటు వేలం పాటలు రసాభసా గా మారి ముచ్చటగా మూడోసారి వాయిదా పడ్డాయి. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేలం పాటలు ప్రారంభించగా హాజరైన సభ్యులు పంచాయతీలో వారపు సంత ఎక్కడ నిర్వహిస్తున్నారో ప్రకటించాలని, మూడు చోట్ల వారసంత నిర్వహణ లేకుండా చూడాలని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన వారపు సంత నిర్వాహకులు పంచాయతీకి బకాయిలు ఉన్నారని వాటి లెక్క తేల్చాలని నిలదీశారు. కనీసం బస్టాండ్ గేటు వేలం పాటలు నిర్వహించడానికి కార్యదర్శి ప్రయత్నించగా సభలో గందరగోళం నెలకొనడంతో విధులేని పరిస్థితిలో మరో మారు వారపు సంత వేలం పాటలు వాయిదా వేస్తూ తదుపరి వేలం పాటల తేదీ ఖరారు చేస్తామని ప్రకటించడంతో సభ్యులు శాంతించారు. తంబళ్లపల్లెలో ప్రస్తుతం పాత బస్టాండ్ వద్ద శనివారం, సోమవారం గంగమ్మ గుడి వద్ద సాయంత్రం క్రాస్ రోడ్ లో సంతలో నిర్వహించడం పరిపాటిగా మారింది. ఈ సంతల నిర్వహణ అయోమయంగా మారడం ట్రాఫిక్ సమస్య, వాహన రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. వారపు సంతకు పాత హై స్కూల్ వెనుక ప్రభుత్వం కేటాయించిన ఎకరం స్థలం లో సంత నిర్వహణకు అధికారులు చొరవ చూపించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. వెంటనే వారపుసంతను పాత ఐటిఐ గ్రౌండ్లో తాత్కాలికంగా నిర్వహించి తదుపరి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేసి సంతను అక్కడకు మార్చితే తంబళ్లపల్లె మధ్యలో సంత ఉండి అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. గంగమ్మ గుడి వద్ద ఉన్న వారపు సంత పరసతోపు పంచాయతీకి చెందినది కాబట్టి అక్కడ సంత నిర్వహణకు ఏర్పాట్లు చేసి అదే విధంగా గొర్రెల సంతకు ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇటు తంబళ్లపల్లి ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని ప్రజల అభిప్రాయపడుతున్నారు. సంబంధిత రెండు పంచాయతీల కార్యదర్శిలు, మండల స్థాయి అధికారులు చొరవచూపి రెండో సంచులు అభివృద్ధి చెంది పంచాయతీల ఆదాయం పెరగడానికి కృషి చేయాల్సి ఉంది.

# మంచి పోషణ ఉన్న బిడ్డ బలమైన దేశానికి పునాది

## పోషణ్ అభియాన్ కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదు

## ప్రతి తల్లికి బిడ్డకు సంపూర్ణ పోషణను అందించే ఒక ప్రజా ఉద్యమం

## చాపాడు లో ఘనంగా 8వ పోషణ్ పక్వాడా అవగాహన కార్యక్రమం

## - ఐసిడిఎస్ సిడిపిఓ ముంతాజ్ బేగం




దువ్వూరు/చాపాడు ఏప్రిల్ 9 (హైద్రాబాద్ ఎస్టేట్): ధి):కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 9 నుండి 23, 2026 వరకు దేశవ్యాప్తంగా 8వ పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, మరియు చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా చాపాడు సెక్టార్ లో మండల కేంద్రంలో సిడిపిఓ ముంతాజ్ బేగం ఆధ్వర్యంలో గురువారం పోషణ్ పక్వాడ గురించి అవగాహన కల్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పోషకాహార ఫలితాలను మెరుగుపరిచేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, ప్రభుత్వం 'పోషణ్ పక్షోత్సవం' 8వ ఎడిషన్‌ను జరుపుకోవడానికి సిద్ధమవుతోంది. మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకారం, ఏప్రిల్ 9 నుండి 23 వరకు జరిగే ఈ పక్షోత్సవం "జీవితంలోని మొదటి ఆరు సంవత్సరాలలో మెదడు అభివృద్ధిని గరిష్ఠ స్థాయికి చేర్చడం"పై దృష్టి సారిస్తుంది. మెదడు అభివృద్ధి, శారీరక ఎదుగుదల మరియు సంపూర్ణ శ్రేయస్సు కోసం బాల్యం ముఖ్యంగా మొదటి 1,000 రోజులు చాలా కీలకమైనదని ఇది గుర్తిస్తుంది. శాస్త్రీయ ఆధారాల ప్రకారం, 85 శాతానికి పైగా మెదడు అభివృద్ధి ఆరు సంవత్సరాల వయస్సు వచ్చేసరికే జరుగుతుంది. ఇది సరైన పోషణ, చురుకైన సంరక్షణ మరియు చిన్న వయసులోనే నేర్చుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది. పోషణ ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇలా ఉద్ఘాటించారు: "మంచి పోషణ ఉన్న బిడ్డ బలమైన దేశానికి పునాది. పోషణ్ అభియాన్ కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదు, ప్రతి తల్లికి, బిడ్డకు సంపూర్ణ పోషణను అందించే ఒక ప్రజా ఉద్యమం." అని తెలియజేశారు. ఎనిమిదవ పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 9 నుండి 23వ తేదీ వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుబ్బరత్నమ్మ, వరలక్ష్మి,ప్రత్యూష,సౌజన్య, కళావతి, ప్రవీణ మరియు అంగన్వాడీ టీచర్లు తల్లులు పాల్గొనడం జరిగింది.

# జగన్ మోహన్ రెడ్డిని కలిసిన చాపాటి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 09((హైద్రాబాద్ ఎస్టేట్): : తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కడప జిల్లా వైసీపి విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు చాపాటి సాయి నారాయణ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గంలో కూటమి నాయకుల కక్షసాధింపు చేష్టల గురించి వివరించడం జరిగింది అన్నారు.



# కీ.శే.అంకిరెడ్డిపల్లి శివరాంరెడ్డి కుమారుడు సెంట్రల్ కస్టమ్స్ ఇన్స్పెక్టర్ గా సెలెక్ట్....



బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 9 :(హైద్రాబాద్ ఎస్టేట్): – బ్రహ్మంగారి మఠం మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లెకు చెందిన అంకిరెడ్డిపల్లె వీరారెడ్డి(దున్నపోతుల వీరారెడ్డి)చిన్న కుమారుడైన కీర్తిశేషులు అంకిరెడ్డిపల్లె శివరాంరెడ్డి(కానిస్టేబుల్)కుమారుడు సెంట్రల్ కస్టమ్స్ ఇన్స్పెక్టర్ గా సెలెక్ట్ కావడం తో వారి బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇతను ఇంటర్ వరకు కోరుకొండ సైనిక్ స్కూల్లో చదివినట్లు వీరి బంధువులు తెలియజేశారు. వీరి తండ్రి అయిన కానిస్టేబుల్ శివరాంరెడ్డి ఆరోగ్యం సరిగా లేకపోయినా తమ కుమారుని కోసం బస్సులో కోరుకొండకు వెళ్లి కుమారుని యోగక్షేమాలు తెలుసుకొని వచ్చేవాడని వారి బంధువులు ఆవేదన చెందారు. వారి తండ్రి కష్టపడ్డ ఫలితానికి వీరి కుమారుడికి మంచి పోస్టు రావడం ఎంతో సంతోషంగా ఉందని,అయితే వారి తండ్రి లేకపోవడం చాలా బాధాకరమని వారు ఆవేదన చెందారు.

# బిసీ ధర్మ దీక్షకు బద్వేల్ నాయకుల మద్దతు



.పోరుమామిళ్ల, ఏప్రిల్ 09((హైద్రాబాద్ ఎస్టేట్):
ఈనెల 11 న భారత చైతన్య యువజన పార్టీ (బిసీవై) రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర యాదవ్ మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం పూలే భవన్ వేదికగా నిర్వహించతలపెట్టిన ఆమరణ నిరాహారదీక్షకు (బిసీ ధర్మదీక్ష) బద్వేల్ నియోజకవర్గం బిసీవై పార్టీ నాయకులు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రామచంద్ర యాదవ్ ప్రధానంగా ఐదు బిసీ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం ముందుంచి డెడ్ లైన్ విధించడం , రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం తెలిసిందే... దీంతో రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహారాదీక్షకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గం బీసీవై నాయకుడు శివారపు నరసింహ యాదవ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ...ఈ నెల 11న మంగళగిరిలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ చేయబోతున్న ఆమరణ నిరాహారదీక్షకు ప్రతి బిసీ సోదరుడు, సోదరి మద్దతు తెలపాలని, మన హక్కులను మనం సాధించుకుందాం కదిలి రమ్మని పిలుపునిచ్చారు. నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో రేగలగడ్డ నారాయణ యాదవ్, పోలు మూరళీకృష్ణ యాదవ్, శ్రీనివాసులు, గురయ్య, రామయ్య యాదవ్, హుస్సేనయ్య, సూర్యనారాయణ,తిరుపాలు యాదవ్, మైనారిటీ సోదరులు రేపు ప్రారంభమయ్యే దీక్షకు సంఘీభావం తెలిపేందుకు మంగళగిరి తరలి వెళుతున్నారు.

# టేకూరుపేట పిహెచ్సిలో పోషణ్ పక్వాడా కార్యక్రమం



.పోరుమామిళ్ల, ఏప్రిల్ 09((హైద్రాబాద్ ఎస్టేట్): ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే పోషన్ పక్వాడా కార్యక్రమాల్లో భాగంగా గురువారం టేకూరుపేట పిహెచ్సీ నందు ఎనిమిదవ పోషన్ పక్వాడా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సిడిపిఓ జమీల్ బి ఆధ్వర్యంలో మొదటి రోజు తల్లి బిడ్డ సంక్షేమం, గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. అలాగే సమతుల ఆహారము, ఎత్తు బరువు గురించి జింక్ ఫుడ్ తీసుకోకుండా ఇంట్లో తయారు చేసిన ఆహారం తీసుకోవడం గురించి చెప్పడం జరిగింది. ఆకు కూరలు, కూరగాయలు, కాల్షియం, ఐరన్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని చెబుతూ వాటి ప్రయోజనాలు వివరించడం జరిగింది. టేకురుపేట పిహెచ్సి డాక్టర్ మేరీ ఎలీషా మాట్లాడుతూ... గర్భవతులు చెకప్స్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. ఐరన్, ఫోలిక్ టాబ్లెట్ లు కచ్చితంగా తీసుకోవాలని, టాబ్లెట్స్ తో పాటు సమతుల ఆహారం కూడా తీసుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల సిడిపిఓ, మెడికల్ ఆఫీసర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొనడం జరిగింది

## రాధాకృష్ణపై వెంటనే చర్యలు తీసుకోవాలి-: కాకాణి పూజిత



నెల్లూరు,(హైద్రాబాద్ ఎస్టేట్):
కాకాణి పూజిత నేతృత్వంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు వేమూరి రాధాకృష్ణపై పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాధాకృష్ణ వ్యాఖ్యలు మహిళా జాతికి అవమానకరమని, జర్నలిజం విలువలను దిగజార్చాయని పూజిత విమర్శించారు. మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించబోమని హెచ్చరించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

# అభివృద్ధి పనుల్లోకష్టపడిన ప్రతి కార్యకర్తకు హక్కుండాలి

## - సుగవాసి ప్రసాద్ బాబు



తంబళ్లపల్లె ఏప్రిల్ 9 (హైద్రాబాద్ ఎస్టేట్): ;తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరు కార్యకర్తలను ఆదుకోవడంలో ఆదర్శవంతం స్థానికంగా జరిగే అభివృద్ధి పనులలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు చేసుకునే హక్కు ఉందని రాజంపేట టిడిపి జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు సూచించారు. గురువారం రాజంపేట పార్లమెంట్ రైతు సంఘం నాయకుడు వెంకటరెడ్డి, సీనియర్ నాయకుడు మదన్మోహన్ లు సుగవాసి ప్రసాద్ బాబును కలిసి మండలం లో జరిగే అభివృద్ధి పనులలో పార్టీ కోసం కష్టపడిన నాయకులు కార్యకర్తలకు భాగస్వామ్యం ఇవ్వాలని కోరారు. మన కూటమి ప్రభుత్వంలో కష్టపడిన నాయకునికి అన్యాయం జరగరాదని ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని కోరగా సుగవాసి ప్రసాద్ బాబు పై విధంగా స్పందించారు. ఈ విషయమై ఆయన మండల స్థాయి అధికారులతో మాట్లాడతాని నాయకులు విభేదాలు మాని ఐకమత్యంతో కలసి మెలసి ప్రభుత్వ అభివృద్ధి పనులు చేసుకుని మండలంలో పార్టీ ప్రతిష్టను పెంచాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోరాటానికి సిద్ధం కావాలన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యం

## -హెల్మెట్ ధారణ తోనే ప్రాణాలకు రక్షణ
## -ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలి
## -మద్యం సేవించి వాహనాలు నడపరాదు
## - దువ్వూరు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ధనుంజయుడు

దువ్వూరు ఏప్రిల్ 9((హైద్రాబాద్ ఎస్టేట్):
రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం దువ్వూరు ఎస్సై ధనుంజయుడు ఆధ్వర్యంలో హెల్మెట్ ప్రాముఖ్యతను తెలియచేస్తూ ఇదమడక చెక్పోస్ట్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి



వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. హెల్మెట్ ధరించని వారిపై కఠినంగా ఎం వి యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత మరియు మీ




కుటుంబం యొక్క సంతోషం గురించి ఆలోచించాలని తెలిపారు. అలాగే కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని. మరియు ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకొనబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# శ్రీ రాచపూడి నాగభూషణం వొకేషనల్ జూనియర్ కళాశాల

## -వొకేషనల్ విద్య విద్యార్థుల భవిష్యత్తు కు బంగారు బాటలు.

బద్వేలు, (హైద్రాబాద్ ఎస్టేట్):
బద్వేలు పరిసర ప్రాంత ప్రజలకు వృత్తి విద్యా కోర్సులను అందుబాటులో ఉంచి విద్యార్థుల భవిషత్తు కు రాచపుడి నాగభూషణం విద్యాసంస్థలు బంగారు బాటలు వేస్తాయని బద్వేలు మున్సిపల్ కమిషనర్ వి.నరసింహారెడ్డి అన్నారు. నేడు బద్వేలు నాగభూషణం వొకేషనల్ జూనియర్ కళాశాల లో జరిగిన ఫేర్వెల్ డే సెలబ్రేషన్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వొకేషనల్ విద్యకు భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. వొకేషనల్ విద్య అనేది ఒక సేవామార్గమని ప్రజలకు సేవచేసే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించినందుకు కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలపాలని బద్వేల్




దివ్య హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా! క్రాంతి కుమార్ అన్నారు. విలువలతో కూడిన విద్యే ఒక మంచి వ్యక్తిత్వాన్ని అలవాటు చేస్తుందని, విద్యార్థులకు చదువుతో పాటు ఉన్నత లక్ష్యాలను సాధించడంలో ఈ విలువలు సహాయపడతాయని బద్వేల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డా! యం. సుబ్బారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం లో బద్వేలు సంజీవని హాస్పిటల్ ఎం.డి. డా. వై. సరస్వతి, పద్మావతి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సంజీవని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా! వి. సుమన్ కోట వి.



మురలీధర్ రెడ్డి, శ్రీ రాచపుడి నాగభూషణం విద్యాసంస్థల పరిపాల అధికారి రాచపుడి వెంకట సాయి కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ బాల ఓబులేసు, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షాహిన, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ దేవి, ఖాజా కోఆర్డినేటర్ డా! అశోక్, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ గంగరాజు, జజు డా! రామసుధ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






## పి హెచ్ సి నందు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం....
## -మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి...

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 9 : (హైద్రాబాద్ ఎస్టేట్):
మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రతి నెల 9వ తారీఖున గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆదేశాల మేరకు మేనేజర్ ఈశ్వరయ్య చారి సూచనలతో మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా గురువారం డాక్టర్ సంపత్ చేతుల మీదుగా పులిహోర ,పెరుగన్నం అందించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది మరియు వీరబ్రహ్మేంద్రస్వామి మఠం సిబ్బంది పాల్గొన్నారు.

## పిడిఎస్ రైస్ పట్టివేత, కేసు నమోదు



కాశినాయన, ఏప్రిల్ 09 (హైద్రాబాద్ ఎస్టేట్): 1,06,032 రూపాయల విలువ చేసే పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు రెవిన్యూ అధికారులతో కలిసి దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కోడిగుడ్లపాడు గ్రామ పంచాయితీ, అనువారిపల్లి గ్రామానికి చెందిన బల్లాని చంద్రశేఖర్ అనే (డీలర్ కాదు) వ్యక్తి రామాలయం వద్ద వున్న తన ఇంటి నుంచి 1,06,032 రూపాయలు విలువగల 2256 కేజీల పిడిఎస్ బియ్యాన్ని 51 ప్లాస్టిక్ బ్యాగుల్లో నిల్వ ఉంచి అక్రమంగా తరలిస్తున్నాడనే సమాచారం అందుకొన్న అధికారులు ఆకస్మిక దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. సెక్షన్ 6(ఎ ) 7(1) ప్రకారం పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాదారుడు, నిల్వదారుడు అయిన బల్లాని చంద్రశేఖర్ పై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని ఎన్ఫోర్స్ మెంట్ (సీఎస్ డి టీ) డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్ చెప్పడం జరిగింది.

## ఉన్నత చదువులకు వరం -పీఎం విద్యాలక్ష్మి

కడప (హైద్రాబాద్ ఎస్టేట్):
గురువారం యోగి వేమన వర్సిటీలో పీఎం విద్యాలక్ష్మి పథకంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ పథకం ద్వారా పేద విద్యార్థులు ఎలాంటి హామీ లేకుండానే ఉన్నత చదువులకు రుణాలు పొందవచ్చని ఎస్బీఐ మేనేజర్ జగన్నాథ్ తెలిపారు. దేశ విదేశాల్లోని ప్రతిష్టాత్మక సంస్థల్లో చదివేవారికి ఇది ఉపయోగకరమని, అర్హులు ఆన్లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## పబ్లిక్ రస్తాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రొద్దుటూరు (హైద్రాబాద్ ఎస్టేట్):
ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లెలో గురువారం రోడ్డు ఆక్రమణలను రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా తొలగించారు. మేకల పెద్ద నాగయ్య అనే వ్యక్తి రస్తాకు అడ్డుగా బండరాళ్లు ఏర్పాటు చేసి ఆక్రమించారని తహశీల్దార్ గంగయ్య తెలిపారు. రూరల్ ఎస్సై, వీఆర్వోలతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆ అడ్డంకులను తొలగించారు. ప్రజా రహదారులను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



## పరిశుభ్రతపై కమిషనర్ కఠిన ఆదేశాలు

కడప(హైద్రాబాద్ ఎస్టేట్):
కడప నగరపాలక సంస్థ కమిషనర్ గురువారం నగరంలో పర్యటించారు. బుగ్గవంకలో ప్రజలు నేరుగా చెత్త వేయకుండా బ్రిడ్జిలపై ఫెన్సింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని పబ్లిక్ టాయిలెట్లను తనిఖీ చేసి, వాటి నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించారు. టాయిలెట్లను నిత్యం శుభ్రంగా ఉంచాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.




## రాధాకృష్ణపై చర్యలు తీసుకోవాలని వైసీపీ ఫిర్యాదు

జమ్మలమడుగు (హైద్రాబాద్ ఎస్టేట్): 9
వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ పరువుకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న ఓ ప్రముఖ ఛానల్ అధినేత రాధాకృష్ణపై న్యాయబద్ధమైన చర్యలు ఉంటాయని వైసీపీ పట్టణ పరిశీలకులు ఇందిరమ్మ హెచ్చరించారు. గురువారం ఆమె వైసీపీ నాయకులతో కలిసి జమ్మలమడుగు పోలీస్ స్టేషన్లో మాట్లాడారు. సదరు ఛానల్లో ప్రసారమైన వార్తలు మహిళలకు, వైసీపీ నాయకుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని సీఐకి ఫిర్యాదు చేశారు.

